క్లుప్తంగా

నేడు దివ్యాంగుల నిర్ధారణ వైద్యశిబిరం

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల నిర్ధారణ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎంఈఓ లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగ బాలబాలికలకు ఉచిత ఉపకరణాల పంపిణీ కోసం నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల భవిత పాఠశాలల ఉపాధ్యాయులు, సంబంధిత డాక్టర్లు పాల్గొంటారని చెప్పారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

రామసముద్రం : మండల కేంద్రంలో సోమవారం ఉదయం 10 గంటలకు చెక్‌పోస్ట్ కూడలిలో వైఎస్సార్‌సీపీ జెండా వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఎంపీపీ కుసుమకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, జెడ్పీటీసీ సభ్యులు , మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ మండల అధ్యక్షులు, మాజీ డైరెక్టర్లు, వార్డు మెంబర్లు , మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ పెద్దలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ఎల్లమ్మ ఆలయ ఆవరణలో ప్రారంభమైన సోెంం ఊరేగింపు

కలికిరి: కలికిరి గ్రామ దేవత ఎల్లమ్మ సోెంం ఊరేగింపు అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయంలో అమ్మవారికి, ఉత్సవ మూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేక అలంకరణ చేసిన పల్లకిపై ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. రెడ్డివారి వంశస్తులు ఆలయ సాంప్రదాయం ప్రకారం పూజలలో పాల్గొని సోెంం ఊరేగింపును ప్రారంభించారు. ఈ నెల 27న ఎల్లమ్మ జాతర ప్రారంభం కానున్న సందర్భంగా అమ్మవారి సోెంం జాతర వరకు 20 రోజుల పాటు కలికిరి పంచాయతీ పరిధిలో గ్రామ గ్రామాన పూజలందుకుని తిరిగి ఆలయానికి చేరుకోవడంతో జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఆలయ నిర్వాహకులు వెంకటరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, యోగేష్ రెడ్డి పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితులకు కేశాల వితరణ

మదనపల్లె : క్యాన్సర్ రోగుల్లో ఆత్మస్థైర్యం నింపి, మానసిక ప్రశాంతతను కలుగుజేసేందుకు, బాధితులకు అండగా నిలిచేందుకు పట్టణంలో ఓ గృహిణి తన కేశాలను దానం చేసింది. ఆదివారం స్థానిక హెల్పింగ్ మైండ్స్ కార్యాలయంలో కురవంక సరస్వతీనగర్‌కు చెందిన నాగవేణి కేన్సర్ బాధితుల కోసం తన కేశాలను అందించింది. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ మాట్లాడుతూ...క్యాన్సర్ బాధితులకు చికిత్స అందించే విధానంలో కీమోథెరపీ లేదా రేడియోథెరపీ కారణంగా జుట్టురాలిపోవడం జరుగుతుందన్నారు. దీంతో క్యాన్సర్ బాధితులు వ్యాధి తీవ్రతకు ఆందోళన చెందడంతో పాటు, మానసికంగా కుంగిపోతారన్నారు. అలాంటి వారిలో మానసికంగా ధైర్యాన్ని నింపేందుకు, వారికి తోడ్పాటును అందించేందుకు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో హెయిర్ డొనేషన్ కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఇప్పటివరకు ఈ కార్యక్రమంలో 49మంది మహిళలు, చిన్నారులు స్వచ్ఛందంగా కేశాలను దానం చేసి తమ సహృదయతను చాటుకున్నారన్నారు. పద్మప్రియ, సుజాత, హెల్పింగ్‌మైండ్స్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత టెట్, డీఎస్సీ శిక్షణ

లక్కిరెడ్డిపల్లి: అన్నమయ్య జిల్లా రాయచోటి కేంద్రంగా విద్యానికేతన్ కోచింగ్ సెంటర్‌లో మైనార్టీ విద్యార్థులకు (ముస్లిం, క్రిస్టియన్) 60 రోజుల టెట్, డీఎస్సీ కోచింగ్ ఇవ్వనున్నట్లు కోచింగ్ సెంటర్ డైరెక్టర్ ఎం లక్ష్మీ మునికుమారి తెలియజేశారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరెన్నీ వివరాలకు కరస్పాండెంట్ కె సుధాకర్ 9550130802 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి విరాళం

చిట్వేలి: మండల పరిధిలోని కంబరాయుడు ఆలయం సమీపాన నూతనంగా నిర్మిస్తున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి గుడ్లవారిపల్లికి చెందిన బత్తిన చిన్న గుండాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సతీమణి బత్తిన ఈశ్వరమ్మ ఆలయ శివలింగం పీఠంకు రూ. 55 వేలు వితరణగా ఆదివారం అందించినట్లు ఆలయ నిర్మాణ ధర్మకర్త కట్టా మోహన్ రావు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సహస్ర కలశాభిషేకం



స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ చేసిన దృశ్యం

గుర్రంకొండ: మండలంలోని రామాపురంలో వెలసిన శ్రీ జ్ఞానాభిరామస్వామి ఆలయంలో సహస్ర కలశాభిషేకం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. మూడురోజులు పాటు నిర్వహించిన ఉత్సవాలు నేటితో ముగిశాయి. ఆదివారం ఉదయం ద్వార తోరణ, ధ్వజకుంభ చతురస్రార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచసూక్తహోమం, శాంతిహోమం ,ప్రాయశ్చిత హోమాలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో పంచామృతాభిషేకం, సహస్ర కలశాభిషేకం, కుంభప్రోక్షణ నిర్వహించారు. శ్రీ సీతా రాములను అందంగా అలంకరించిన వాహనంలో కొలువుదీర్చి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకొని గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయఅర్చకులు భక్తులందరికి స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అర్చకులు వేణుగోపాలబట్టర్, కృష్ణ,గోపాలాభట్టర్, దొరస్వామి, మధుసూదన్,శ్రీనివాసబట్టర్ పాల్గొన్నారు.



సహస్ర కలశాభిషేక మహోత్సవం సందర్భంగా ఆలయంలో శాంతిహోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీరెడ్డెమ్మతల్లీ... చల్లంగా చూడు తల్లీ

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. రెడ్డెమ్మతల్లీ చల్లంగా చూడు తల్లీ అంటూ భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో మొక్కుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించారు. సంతానాన్ని ప్రసాదించే చల్లని తల్లిగా ప్రసిద్ధిపొందిన అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. ఆలయ పరిసరాల్లోని దిగువ తొట్లివారిపల్లెలో అమ్మవారి అర్చకుల కుటుంబీకులు పంపిణీ చేసే ఆకు పసరును సేవించి మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించిచారు. తడిబట్టలతోనే అమ్మవారి ఎదుట సంతాన కోసం ఒరపడ్డారు. సీమ జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకోవడం విశేషం.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

బి.కొత్తకోట: కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ చట్టాన్ని అమలు చేసే దిశగా కార్మిక బోర్డును పునరుద్ధరించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం మాజీ అధ్యక్షులు ఎస్. మనోహర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బి.కొత్తకోటలో పెయింటర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 36 వేలకు పైగా ఉన్న కార్మికుల క్లైములకు ఆర్థిక సాయాన్ని అందజేయాలని కోరారు. సంక్షేమ బోర్డు నుంచి అందుతున్న ప్రమాద, సహజ మరణం, పిల్లల చదువులకు స్కాలర్ షిప్పులు, కార్మికులకు శిక్షణ, ఉచితంగా పనిముట్లు పంపిణీ సదుపాయాలను కల్పించి కార్మికులను ఆదుకోవాలని కోరారు. యూనియన్ అధ్యక్షులు కే.రమేష్ రెడ్డి, బషీర్ ఖాన్, హెచ్.షమీవుల్లా, కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్

పెద్దతిప్పసముద్రం: మండలంలోని రాపూరివాండ్లపల్లి పంచాయతీలో ఇసుకను అనధికారికంగా తరలిస్తున్నారని పలువురు ఎస్ఐ రవీంద్రబాబుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ ఆదివారం సిబ్బందితో వెళ్లి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

పట్టణాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం అవసరం

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : పట్టణ అభివృద్ధిలో ప్రజల సహకారం, భాగస్వామ్యం అవసరమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లో శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిత మదనపల్లె సాధనలో భాగంగా పట్టణంలో 50,000 మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందిద్దామని తాను ఇచ్చిన పిలుపుకు విశేష ప్రజాస్పందన రావడం సంతోషంగా ఉందన్నారు. రెండో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమంలో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల భాగస్వామ్యం తీసుకోవడంపై కరస్పాండెంట్ డాక్టర్.ఆర్.గురుప్రసాద్‌ను అభినందించారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, జ్ఞానాంబిక ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రాఘవేంద్ర, టీడీపీ నాయకులు రాటకొండ నవీన్, జి.వి.నాయుడు పాల్గొన్నారు.



ప్రశాంత్‌నగర్‌లో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, డాక్టర్ గురుప్రసాద్

హెల్మెట్‌తోనే ప్రమాదాల నివారణ సాధ్యం

వాల్మీకిపురం: హెల్మెట్‌తో ప్రమాదాల నివారణ సాధ్యమని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఏజీపీ అశోక్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి – మదనపల్లి జాతీయ రహదారిపై ట్రాఫిక్ నియమాలపై జూనియర్ సివిల్ కోర్టు జడ్జి గురు అరవింద్ ఆదేశాలమేరకు ట్రాఫిక్ నియమాలపై వాహన చోదకులకు న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఉద్దేశించి ఎస్ఐ క్రిష్ణమూర్తి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలలో భాగంగా హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెంట్ ధరించి ప్రయాణించడం సురక్షితమన్నారు. అలాగే వాహనాలను తీసుకెళ్లేటప్పుడు డ్రైవింగ్ లైసెన్సు, వాహన రికార్డులను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలన్నారు. మలువులు, స్పీడ్ బ్రేకర్ల వద్ద నెమ్మదిగా వెళ్లాలని, సురక్షిత ప్రయాణం ఎంతో మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కృష్ణమూర్తి

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కేవీపల్లె : మండలంలోని చీనేపల్లెలో ఆదివారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ సౌజన్యంతో శ్రీనివాస ఛారిటుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ' ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి. బ్రహ్మారెడ్డి, కో-ఆర్డినేటర్ శశికుమార్‌రెడ్డి, మాట్లాడుతూ గ్రామీణ మహిళల ఆరోగ్య పరిరక్షణ, గర్భాశయ క్యాన్సర్ నివారణ కోసం రూపకల్పన చేసిన వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామీణ మహిళల్లో కన్పిస్తున్న గర్భాశయ ముఖద్వారపు క్యాన్సర్ నివారణే లక్ష్యంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ వైద్యశిబిరంలో 20 మంది మహిళలకు పాప్ స్మియర్ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అలాగే సాధారణ జబ్బులకు సంబంధించి 115 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మెడిగో హాస్పిటల్స్ ఆర్థో పెడిషన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ సజిత్, డాక్టర్ రమాదేవి, శ్రీనివాసులురెడ్డి, ఆదినారాయణ, రామాంజనేయులు, శ్రీనివాసులు, షబ్బీర్, డాక్టర్ గౌస్, డాక్టర్ బాషా పాల్గొన్నారు.



చీనేపల్లెలో సంజీవిని గ్రామీణ స్త్రీ ఆరోగ్య పరిరక్షణ వైద్యశిబిరం

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

పీలేరు రూరల్: స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యమని సర్పంచ్ జీనత్‌షఫీ అన్నారు. ఆదివారం స్థానిక కొత్తపల్లె సమ్మర్ స్టోరేజ్ వద్ద నీటి సంపును శుద్ధి చేశారు. నీటి సంపులో పాత ఇసుకను తొలగించి కొత్త ఇసుకను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని అన్ని ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. ఎక్కడా తాగునీటి పైపులైన్లు లీకేజీ లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



నీటి సంపులో ఇసుక మార్పిడి చేస్తున్న దృశ్యం

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

కురబలకోట: మండలంలోని అంగళ్లు ఎరువుల దుకాణాలపై ఆదివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎస్. సాయిరెడ్డి, రామకృష్ణ నాయక్ దాడులు నిర్వహించారు. స్టాక్ రిజిష్టర్లు, బిల్స్ తనిఖీ చేశారు. నిల్వలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయించాలన్నారు. అధిక ధరలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

సంబేపల్లె: అధికారులందరూ సమన్వయంతో పని చేసి మండల అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మండలంలో అత్యంత ప్రాధాన్యత పనులు గుర్తించి వెంటనే నివేదిక పంపాలని అధికారులకు సూచించారు. మండలంలో శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పనులు కల్పించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పేదల కోసం సమర్థవంతంగా నిర్వహిస్తోందని ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. కాగా.. మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడడంతో మంత్రి సాధారణ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మంత్రి పర్యటన

చిన్నమండెం : చిన్నమండెం మండల పరిధిలో రెండు గ్రామ పంచాయతీలలో రాష్ట్ర రవాణా శాఖ, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పర్యటించారు. పడమటికోన గ్రామం వడ్డెపల్లెలో పల్లపు చందు, సిద్ధార్థ ఇచ్చిన విందులో, కొత్తపల్లె పంచాయతీలో వెంకట్రామిరెడ్డి ఇచ్చిన విందులో పాల్గొన్నారు.

నల్లగంగమ్మ తల్లికి ఆషాడ శోభ

సంబేపల్లె : మండల పరిధిలో వెలసిన శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయానికి ఆషాడశోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా మండల పరిధిలోని అడవికమ్మపల్లెలో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి భక్తులు పాదయాత్రగా అమ్మవారికి సారె తీసుకొని నల్లగంగమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి సారె సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానదిపై కొలువై ఉన్న శ్రీ మల్లూరమ్మ తల్లికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మొక్కుబడులు తీరిన వారు అమ్మవారికి బోనాలు సమర్పించారు. వచ్చిన భక్తాదులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.



సంబేపల్లె : భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ

గంగమ్మకు బోనాలు

లక్కిరెడ్డిపల్లి: అనంతపురం గంగమ్మ దేవతకు ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి, తలనీలాలు అర్పించారు. ఆదివారం కావడంతో చుట్టు ప్రక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది.



లక్కిరెడ్డిపల్లి: ప్రత్యేక అలంకారంలో గంగమ్మతల్లి



సంబేపల్లె : నల్లగంగమ్మతల్లికి సారె తీసుకెళుతున్న భక్తులు



చిన్నమండెం: మల్లూరమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

మల్లాలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే

పుల్లంపేట: రైల్వేకోడూరు శాసన సభ్యులు అరవ శ్రీధర్, ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి ఆదివారం మండల పరిధిలోని ఆర్ గొల్లపల్లి గ్రామ పంచాయతీలోని మల్లాలమ్మ తల్లిను ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామ ప్రజలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ రెడ్డయ్య, వెంకట సుబ్బారెడ్డి, వడ్డిపల్లి వెంకటరమణ, రమేష్, రొంపిచెర్ల మురళి, ప్రసాద్, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



బి.కొత్తకోటలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



పీలేరు: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

బి.కొత్తకోట: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30వ ఆవిర్భావ దిన వేడుకలు ఆదివారం బి.కొత్తకోటలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక జ్యోతిచౌక్ లో జెండాను ఎగురవేశారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుమ్ము వెంకటేశ్వర్లు (చిన్న) మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ బడుగు బలహీన వర్గాల అండగా నిలిచారన్నారు. తుమ్మనంగుట్టలోనూ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెస్పీ నాయకులు భవాని వెంకటేష్, మండల కన్వీనర్ చౌడప్ప కో కన్వీనర్ గట్టు రమణ, గట్టు అంజి, రామప్ప, శంకర, గంగులప్ప, వేణు, కొమ్ము రాముడు, శంకర, గంగన్న, నరసింహులు పాల్గొన్నారు.

సమసమాజ నిర్మాణమే లక్ష్యం

పీలేరు : సమ సమాజ నిర్మాణమే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని ఎమ్మార్పీఎస్ నాయకులు గండికోట హుస్సేనయ్య, ఎంఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్, మండల అధ్యక్షుడు నరసింహులు అన్నారు. ఆదివారం స్థానిక మోడల్ కాలనీలో, మండలంలోని వేపులబైలులో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ స్థాపించిన ఎమ్మార్పీఎస్ అంచలంచెలుగా అభివృద్ధి చెందిందని తెలిపారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు చరణ్‌కుమార్, కిరణ్, కృష్ణయ్య, శ్రీకాంత్, శంకర్, రెడ్డికుమార్, బీసీ నాయకులు రాజ పాల్గొన్నారు.

ఘనంగా ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

కలికిరి : ఎంఆర్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ జన్మదినం, ఎంఆర్‌పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని కె.కొత్తపల్లిలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జ్ గురుప్రసాద్ మాదిగ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు ప్రవీణ్, చందు, శ్రీకాంత్, చిట్టి, సూర్యకుమార్, నవ్య, సమంత, వాణిశ్రీ, ఎర్రమ్మ, రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సంబరాలు

తంబళ్లపల్లి: తంబళ్లపల్లెలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తహశీల్దారు కార్యాలయం ఎదురు హరిత సర్కిల్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటప్ప, మల్లిఖార్జున ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. నాయకులు బాస్కర్, బొజ్జప్ప, రమణ, టీడీపీ నాయకులు రామచంద్ర, సిద్దమ్మ, రెడ్డెప్ప రెడ్డి, చలపతి నాయుడు, ఉత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలను జయప్రదం చేయండి

ఓబులవారిపల్లె (రైల్వేకోడూరు అర్బన్): దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, పెనగలూరు, చిట్వేలి మండలాలలో నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని వైఎస్సార్ జయంతి వేడుకలను నిర్వహించాలన్నారు. అలాగే ఓబులవారిపల్లెలో పార్టీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ఓబులవారిపల్లె మండలంలోని కొర్లకుంట క్రాస్ రోడ్డు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్దకు కార్యకర్తలు, నాయకులు పాల్గొని వైఎస్సార్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సుకుమార్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

నేడు పుల్లంపేటలో వైఎస్సార్ జయంతి

పుల్లంపేట: పుల్లంపేట బైపాస్ రోడ్డులో దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 75వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ముస్తాక్, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ పాల్గొంటారని. ఈ కార్యక్రమంలో ప్రజలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

సుండుపల్లె : అన్నమయ్య జిల్లా టి. సుండుపల్లె ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్నారు. 2004-05 పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడెక్కడో ఉన్నత స్థాయిల్లో స్థిరపడ్డ వారంతా బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాల ను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరియోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత ఒకరినొకరు కలుసుకొని మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదాలు తీసుకున్నారు. తమ సహ విద్యార్థులు ఎవరైనా అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుంటే వారికి అందరూ కలిసికట్టుగా ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు.